క్లుప్తంగా

పట్టు పరిశ్రమతో అధికాదాయం : కలెక్టర్

కాకినాడ సిటీ: జిల్లాలో మెట్టప్రాంత రైతులు బోరు కింద వ్యవసాయం చేసే వారు పట్టు పరిశ్రమను చేపట్టి అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో పట్టు పరిశ్రమశాఖకు సంబంధించి పోస్టర్లను జిల్లా పట్టు పరిశ్రమ అధికారి బీఎంవీ రామరాజుతో కలసి విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. పట్టు పరిశ్రమ వల్ల రైతులకు, డీలర్లుకు, వీవర్స్‌కు, చేనేత కార్మికులకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. మల్బరీ తోటలు కొత్తగా నాటే రైతులకు ఎకరానికి రూ.25 వేలు యూనిట్ విలువపై 75 శాతం సబ్సిడీ రూ. 18,750 అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క రైతుకు సబ్సిడీ 5 ఎకరాలకు మంజూరు చేస్తారన్నారు. ఈ పథకాలకు సంబంధించి సబ్సిడీ ధనం నేరుగా లబ్ధిదారుల ట్రాన్స్‌ఫర్ ద్వారా మాత్రమే రైతు ఖాతాలో జమ చేస్తారని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు.

ఘనంగా భగీరథ జయంతి



భగీరథుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: రుషి పుంగవుడు భగీరథ జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సతీష్ కుమార్ భగీరథుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. భగీరథుడి తపస్సుకు మెచ్చి గంగ దివి నుంచి భువికి దిగి వచ్చిందన్నది ఇతిహాస వాస్తవమని ఎస్పీ పేర్కొన్నారు.

స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కార్యవర్గం



సంస్థ కార్యవర్గ సభ్యులు

బాలాజీచెరువు: అలయన్స్ క్లబ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం స్థానిక ప్రైవేట్ హోటల్లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, కార్యదర్శిగా పెంకే గోవిందరాజు, కోశాధికారిగా కొత్త మెహర్ శ్రీరాములు, వైస్ ప్రెసిడెంట్‌గా గాలి రవికృష్ణ, సంయుక్త కోశాధికారిగా మద్దా వికాస్, జాయింట్ కోశాధికారిగా కడలి బ్రహ్మానందం, పీఆర్వోగా బాలత్రిపుర సుందరి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా అలయన్స్ క్లబ్ గవర్నర్ టీవీ వరలక్ష్మి, ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ చప్పిడి వేంకటేశ్వరరావు హాజరై క్లబ్ ఆశయాలు, చేపట్టవలసి కార్యక్రమాలు వివరించారు.

అంకితభావంతోనే గుర్తింపు

బదిలీ అయిన న్యాయమూర్తులకు సత్కారం



న్యాయమూర్తి భరద్వాజ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

కాకినాడ లీగల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపుతో పాటు ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి పేర్కొన్నారు. ఇటీవల బదిలీ అయిన కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.భరద్వాజ్, నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సీకేవీ సత్యకాంత్ కుమార్, స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సి.జానకి, స్పెషల్ ఎక్సైజ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.మాధవిలతో పాటు, బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మత్తింటి విశ్వేశ్వరరావు, కమిటీ ఆధ్వర్యంలో గురువారం న్యాయమూర్తులకు దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ముందుగా ఇటీవల బార్‌కు ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు న్యాయవాదులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు.

గ్యాస్ లీకేజీ

కాకినాడ క్రైం: కాకినాడలోని శాంతినగర్‌లోని శ్రీటెక్నోస్కూల్ సమీపంలో గురువారం ప్రమాదవశాత్తు గ్యాస్ లీకైంది. డ్రైనేజీలు తవ్వేందుకు పొక్లెయినర్ వినియోగించగా లోపల ఉన్న గ్యాస్‌పైపులు ధ్వంసమై గ్యాస్ లీకేజీకి దారితీసింది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది భాగ్యనగర్ గ్యాస్ యాజమాన్యాన్ని పిలిపించి లీకేజీని కట్టడి చేశారు.

ఒకరికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో గురువారం ఒక వ్యక్తికి కోవిడ్ నిర్ధారణ అయింది. బుధవారం సేకరించిన 83 నమూనాల్లో ఈ ఫలితం వెలువడింది.

రేపు విద్యుత్ అంతరాయం

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ కోరారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేపూరు, కొవ్వాడ, గంగనాపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

కొంగోడు చూడండయ్యా!

- వంతెన నిర్మాణంపై అధికారుల నిర్లక్ష్యం
- రూ.3 కోట్లు కొల్లగొట్టిన కాంట్రాక్టర్
- నోటీసులు ఇచ్చినా స్పందించని వైనం
- నిర్మాణం పూర్తయితే రైతులకు ఉపయుక్తం



కొంగోడు వద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం చేపట్టింది ఇక్కడే. (అంతర చిత్రం) ఒక పిల్లర్ కాంక్రీట్ ధ్వంసమై ఊసలు తుప్పుపట్టిన దృశ్యం

కరప: తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడువద్ద చేపట్టిన వంతెన నిర్మాణాన్ని సత్వరం పూర్తిచేయాలని మూడు గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఆరంభ శూరత్వంగా ప్రారంభించి వదిలేసిన పనుల్లో ఇదీ ఒకటి కావడం గమనార్హం. వంతెన నిర్మాణం కోసం వేసిన పిల్లర్ల కాంక్రీట్ కొట్టుకుపోయి, ఊసలు బయటకు వచ్చి తుప్పుపట్టాయి. వంతెన పనులు పునఃప్రారంభించినా, భూ స్థాయికి వేసిన పిల్లర్లు పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. తమ పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందనుకున్న ఈ వంతెనకు ఆదిలోనే దెబ్బతగలడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంగోడు రైతులకు చెందిన పొలాలు వేములవాడ, కరప పొలిమేరలలో ఉంటాయి. రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాలకు రాకపోకలు సాగించాలన్నా, పంట ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా తుల్యభాగ డ్రెయిన్ దాటాల్సి ఉంటుంది. ఇందుకు దోనె ఒక్కటే ఆధారం. అటు కాజులూరు మండల వాసులు కరప మండలం రావాలన్నా కొంగోడు మీదుగా తుల్యభాగ డ్రెయిన్ దాటాలి. పంట ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా, దమ్ము ట్రాక్టర్లు వెళ్లాలన్నా ఆరు కిలోమీటర్లు చుట్టు తిరిగి గొర్రిపూడి మీదుగా ఏటిగట్టు రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అదే తుల్యభాగడ్రెయిన్‌పై కొంగోడువద్ద వంతెన నిర్మిస్తే రైతులకు, రెండు మండలాల వారికి దగ్గర దారిగా ఉంటుంది. 2017లో అప్పటి ప్రభుత్వం రూ.5.19 కోట్లు మంజూరుచేయగా అదే ఏడాది డిసెంబర్ 30న ఎన్టీఆర్ వారధి పేరిట అప్పటి ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అట్టహాసంగా ఈ నిర్మాణపనులకు భూమిపూజచేశారు. తర్వాత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి భూమి స్థాయికి నాలుగు పిల్లర్లు వేశారు. ఆనక ఆ పనులు వదిలేయడంతో పిల్లర్లు కూడా పాడైపోయాయి. ఇప్పుడు నిర్మించాలన్నా ఆ పిల్లర్లను తొలగించాల్సిందేనని అధికారులు అంటున్నారు. వంతెన నిర్మాణానికే రూ.5.19 కోట్లు మంజూరు చేస్తే, భూమి లెవిల్ వరకు చేసిన దానికి రూ 3.01 కోట్లు చెల్లించినట్టు అధికారుల అంటున్నారు. వంతెన నిర్మాణ పనులు ఆగి పోతే డ్రెయినేజీ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ పనులకు డ్రెనేజీ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

ఈ వంతెన నిర్మాణానికి ఐదు బిల్లులుగా రూ.3.01 కోట్లు చెల్లించాం. పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఎనిమిది సార్లు నోటీసులు ఇచ్చాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్ఈ, ఈఈ, డీఈఈలతో పాటు తాను కూడా నోటీసులిచ్చినా కాంట్రాక్టర్ నుంచి స్పందన లేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం. – కె.కీర్తి, ఏఈఈ, డ్రైనేజీ శాఖ

వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



కొంగోడు వద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం చేపట్టి వదిలేశారు. రైతులకు, ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే వంతెన నిర్మాణం పూర్తి చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. – కోట వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయసలహా సంఘం అధ్యక్షుడు, కొంగోడు

సమాజ ప్రగతిలో సంపాదకుల పాత్ర కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: సమాజ మార్పులో పత్రికా సంపాదకుల పాత్ర కీలకమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన ఎడిటర్స్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విలేకరులు సేకరించిన సమాచారం ప్రజాహితానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడంలో కీలకంగా ఉంటారన్నారు. అనంతరం లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనాథ్, ఎం.శివరామకృష్ణ, పితాని రాము, కృష్ణంరాజు, అంజిబాబు, దుర్గాని పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగుల బాధ్యతల స్వీకరణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడకు బదిలీపై వచ్చిన డీసీసీబీ అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. జనరల్ మేనేజర్లు నన్నపనేని రంగబాబు, కె.శ్రీనివాసులు, డీజీఎం జీఎస్‌వీ సత్యనారాయణ విధుల్లో చేరారు. తొలుత సీఈఓ ఆర్‌వీ నరసింహారావును మర్యాద పూర్వకంగా కలుసుకుని బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన జీఎంలు, డీజీఎంలను పలువురు ఉద్యోగులు అభినందించారు.

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి



కొవ్వాడలో ఓహెచ్ఆర్ ట్యాంకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- కొవ్వాడలో పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబు
- గ్రామంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే కురసాల

కాకినాడ రూరల్: తాగునీటి ఎద్దడి లేకుండా ప్రతి ఇంటికీ తాగునీటి వసతి కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని కొవ్వాడలో రూ.92 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద నిర్మించిన వాటర్‌ట్యాంకును ప్రారంభించి కుళాయి ద్వారా సరఫరా చేశారు. వీటితో పాటు రూ.3కోట్ల నిధులతో రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎంపీపీ గోపుశెట్టి పద్మజ, సర్పంచ్ కోటిపల్లి ఉమ, ఉప సర్పంచ్ తోటకూర శ్రీను, నాయకులు గోపుశెట్టి బాబ్జీ, దామోర రంగబాబు, కండెల రవి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం విజయవంతంగా సాగేందుకు సహకరించిన సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఎమ్మెల్యే అభినందించారు.

రేపూరులో సచివాలయ సిబ్బందితో సమావేశం

కొవ్వాడ గ్రామానికి ఆనుకుని రేపూరులో సర్పంచ్ నక్కా వీరన్న అధ్యక్షతన సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎమ్మెల్యే కన్నబాబు సమీక్షించారు. గ్రామ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించారు. త్వరలో నిర్వహించనున్న గడప గడపకు కార్యక్రమానికి సమాయత్తమవ్వాలని కోరారు. ఎంపీటీసీ మామిడాడ నాగచక్రం పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

మండలంలోని కొవ్వాడ గ్రామంలో జనసేన నుంచి పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. గ్రామ నాయకులు గోపుశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీను, దామోర రంగబాబు తదితరుల ఆధ్వర్యంలో జనసేనకు చెందిన బూరుల రాము, కోన సత్తిబాబు, తాడేలా తాతాజీ, కామన భాస్కరరావు, తదితరులు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించిన కన్నబాబు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి వారధుల్లా పనిచేయాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి అడ్డుగోడ కొండబాబు



దుమ్ములపేటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: సొంత సామాజికవర్గ అభివృద్ధికి సైతం అడుగడుగునా అడ్డుపడుతున్న ఘనత టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పార్టీ నేతలతో కలిసి దుమ్ములపేట ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న గ్రామకంఠం భూమి లోతట్టుగా ఉండి తరచూ ముంపునకు గురవుతున్న పరిస్థితుల్లో ఆ ప్రాంతాన్ని చదును చేయించి అభివృద్ధి చేయిస్తుంటే వైఎస్సార్ సీపీ కబ్జాలు చేస్తోందంటూ వనమాడి, జనసేన నేతలు దుష్ప్రచారానికి తెరతీశారని మండిపడ్డారు. ఆ భూమి వల్ల దుర్వాసన ఏర్పడి, దోమలు, అనారోగ్య పరిస్థితుల నుంచి స్థానిక ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశ్యంతో సొంత ఖర్చులతో అక్కడ చదును చేయిస్తుంటే వనమాడి అడ్డు తగులుతున్నారని ధ్వజమెత్తారు. మత్స్యకారుల్లో అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వనమాడి దుమ్ములపేటలోని వాడబలిజ మత్స్యకారులకు మంచి జరుగుతుంటే చూడలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. దుమ్ములపేట ప్రాంతం పూర్తిగా మత్స్యకారులకు సంబంధించినదని, ఆ స్థలాన్ని అభివృద్ధి చేసి ఆ వర్గానికే చెందేలా అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. సొంత సామాజిక వర్గాన్ని కొండబాబు నిర్లక్ష్యం చేస్తే ముఖ్యమంత్రి జగన్ మాత్రం మత్స్యకారుల్లోని అగ్నికుల క్షత్రియకులకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్, డిప్యూటీ మేయర్ పదవిని, వాడబలిజలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారన్నారు. ఈ మేరకు అక్కడి పెద్దలను సమావేశపరిచి ఎమ్మెల్యే ద్వారంపూడి వాస్తవాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆయన వెంట కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక మత్స్యకార నాయకులు వాసుపల్లి కృష్ణ, మోసాపేతూరు, మోసపల్లి రాంబాబు, ఎరుపల్లి సీతారామ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

దైవకార్యం నర్సింగ్

- ఎంపీ గీత
- అపోలో ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



ఎంపీ గీతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఆహ్వానిస్తున్న ఆస్పత్రి యాజమాన్యం, చిత్రంలో అతిథులు

కాకినాడ క్రైం: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సేవలందించే నర్సింగ్ ఓ దైవకార్యమని ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక డి-కన్వెన్షన్ హాల్లో కాకినాడ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో సీఈఓ ఐవీ రమణ అధ్యక్షతన నర్సులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ గీత హాజరుకాగా, డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, ఇండియన్ రీసక్సియేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్ చక్రరావు, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కామేశ్వరరావు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ, మదర్ థెరిసా, ఫ్లోరెన్స్ నైటింగేల్ వంటి సేవా మూర్తులు నర్సింగ్ సేవలకు వన్నె తెచ్చారన్నారు. నర్సుల నైపుణ్యాలను వృద్ధి చేసేందుకు జరుగుతున్న శిక్షణ తరగతులు ఎంతో ప్రయోజనకరమని, ఆసుపత్రి యాజమాన్యం చొరవను అభినందించారు. ఐవీ రమణ మాట్లాడుతూ నర్సింగ్ శిక్షణ ఇక్కడే తొలిసారిగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్లు చక్రరావు, కామేశ్వరరావు మాట్లాడుతూ వైద్య సేవలకు నర్సులు వెన్నెముక అన్నారు. అపోలో ప్రతినిధి మూర్తి మాట్లాడుతూ ఈ శిక్షణకు 500 మంది నర్సులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ కౌన్సిల్ రిజిస్టర్ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ వల్లి, డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ అపోలో ఆసుపత్రి కాకినాడ కెప్టెన్ మధుకర్, కాకినాడ అపోలో ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీపీ చటర్జీ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ ఎదురుగా భవాని కాస్టింగ్స్ వద్ద సామాజిక కార్యకర్త అనపాల ఆంజనేయరెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీ వంగా గీత, రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వీటిని గురువారం ప్రారంభించారు. కాకినాడ-పిఠాపురం రహదారిలో ప్రయాణికుల సౌకర్యార్థం ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడంపై ఆంజనేయరెడ్డిని వారు అభినందించారు. మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, పాటి నాగు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: కొమరగిరి, ఏపీ త్రయం, పండూరు లే-అవుట్‌లలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణ ప్రగతిపై హౌసింగ్, నగరపాలక సంస్థ, మెప్మా, ప్రత్యేక అధికారులతో సమీక్షించి గృహ నిర్మాణాలకు ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ లక్ష్యాలపై వారానికోసారి సమీక్షిస్తామని, లబ్ధిదారులుగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీపై కూడా దృష్టి సారించాలని ఏడీసీ సూచించారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, గృహ నిర్మాణ శాఖ ఈఈ గుప్తా, డీఈ సత్యనారాయణ రెడ్డి, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

భద్రత నడుమ ఈవీఎంల తరలింపు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇక్కడ ఉన్న ఈవీఎంలను పటిష్ట బందోబస్తు నడుమ వివిధ ప్రాంతాలకు గురువారం తరలించారు. గత ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ సమకూర్చిన అదనపు ఈవీఎంలు కార్పొరేషన్ కార్యాలయంలో భద్రపరిచారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు వీటిని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌ను తెరచి ఆయా ప్రాంతాలకు పంపారు. ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, సూపరింటెండెంట్లు ఈ మేరకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన వేళంగి విద్యార్థులు



గుత్తుల అశ్విని



సోడాబత్తుల రాజేశ్వరి



శ్రీవంశీప్రదీప్

కరప: వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రథమ సంవత్సరంలో 30 శాతం, ద్వితీయ సంవత్సరంలో 41 శాతం ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ జీజీకే నూకరాజు గురువారం తెలిపారు. వి.శ్రీవంశీ సందీప్ (ఎంపీసీ)- 429, సీహెచ్ సునీత(సీఈసీ)-418, వంశీరాజేష్ (ఎంపీసీ)-416 మార్కులతో వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో గుత్తుల అశ్విని (బైపీసీ) 933, సోడాబత్తుల రాజేశ్వరి (సీఈసీ) 889, దుప్పలపూడి భాను గంగాలక్ష్మి (ఎంపీసీ)-833 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

ఉపాధ్యాయుడికి కలెక్టర్ అభినందన

కాకినాడ సిటీ: లిమ్కా బుక్ రికార్డుల్లో స్థానం సాధించిన జిల్లాలోని పిఠాపురం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పర్వత వెంకట నారాయణను కలెక్టర్ కృతికా శుక్లా గురువారం అభినందించారు. పర్యావరణ సంబంధ నాణాల సేకరణలో ఆయన ఈ ఘనత సాధించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆయన కలసి రికార్డు విశేషాలను వివరించారు.

నేడు ఉపాధ్యాయులకు శిక్షణ

కాకినాడ రూరల్: మండలంలోని 76 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై శుక్రవారం ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు తెలిపారు. వలసపాకల గంగరాజునగర్‌లో ఆదిత్య స్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుందని గురువారం గణేష్‌బాబు తెలిపారు.

తాగునీటి సరఫరాకు సత్వర చర్యలు తీసుకోండి

కరప: వేసవి సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం తాగునీటి సరఫరా, గృహనిర్మాణాలపై ఆమె అధ్యక్షతన సమీక్ష సాగింది. శివారు గ్రామాలకు అవసరమైతే ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని, పేపకాయలపాలెంలో జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఇళ్లస్థలాలు పొందిన లబ్ధిదారులను చైతన్యపరచి ఇళ్ల నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఎ.వర్ధన్ మాట్లాడుతూ సామూహిక రక్షిత నీటి పథకం ద్వారా గ్రామాలకు తాగునీరందేలా, శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హౌసింగ్ ఏఈఈ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గృహ నిర్మాణాల విషయంలో ప్రజాప్రతినిధులు లబ్ధిదారులను చైతన్యపరచడంలో తమకు సహకరించాలని కోరారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



పెదకొత్తూరులో గృహిణికి కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

కరప: మండల పరిధిలోని పలుగ్రామాల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. కరప, పేపకాయలపాలెం, వలసపాకల, గొర్డటిపాలెం, వేములవాడ, పెదకొత్తూరు, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పాలనపై సర్వే నిర్వహించి ప్రశ్నావళి ద్వారా ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అదే సమయంలో గత టీడీపీ చంద్రబాబు పాలనలో ఎంత వంచనకు గురైందీ వివరించి సీఎంగా జగనే మళ్లీ రావాలని వివరించారు. దీనికి ప్రతిగా జగనన్నే మా నమ్మకం అంటూ ఇళ్లపై గృహిణులే స్టిక్కర్లు అతికించుకున్నారు. మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడిగా పల్లయ్య

కాకినాడ రూరల్: రేషన్ డీలర్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని వలసపాకల గ్రామానికి చెందిన డీలర్ నందిపాటి పల్లయ్య ఎన్నికయ్యారు. వివిధ మండలాల నుంచి వచ్చిన రేషన్ డీలర్లు గురువారం రమణయ్యపేటలో సమావేశమై సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి విన్నవించాలని తీర్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కాశీరాజు, ప్రధాన కార్యదర్శిగా రాంపండు, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. అనంతరం వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

నైపుణ్యాభివృద్ధిపై మత్స్యకారులకు శిక్షణ

కాకినాడ రూరల్: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులు నైపుణ్యాభివృద్ధిపై కాకినాడ ఎస్ఐఎఫ్‌టీలో మూడు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. కమ్యూనికేషన్ అండ్ నావిగేషనల్ ఎక్విప్‌మెంట్ ఆన్ బోట్ ఫిషింగ్ వెసెల్ అనే అంశంపై విశాఖపట్నంలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ (సిఫ్‌నెట్) యూనిట్ అధికారులు శిక్షణను అందించారు. జీపీఆర్ఎస్ ద్వారా సముద్రంలో చేపల వేట సాగించేందుకు నైపుణ్యం కల్పించారు. 29 వరకు శిక్షణ తరగతులు జరగనున్నాయి. శిక్షణలో బోట్ ఓనర్లు, డ్రైవర్లు 40మంది పాల్గొన్నారు. వీరికి ఇన్‌స్ట్రక్టర్లు షాజ్, బాజిపేయి శిక్షణ అందించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి జీపీఆర్ఎస్ కిట్లు అందించారు.